ఒక్కసారి చెబితే ఇట్టే పట్టేస్తాడు!



క్లాస్ టీచర్ దివ్యారెడ్డి చేతులమీదుగా అవార్డు తీసుకుంటున్న ఆదిత్యవర్ధన్

కుత్బుల్లాపూర్: ఆన్‌లైన్ పరీక్షలో చింతల్ బచ్‌పన్ స్కూల్ విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరచి అవార్డును కైవసం చేసుకున్నాడు. బచ్‌పన్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న ఎస్.ఆదిత్య వర్ధన్ 2019 నవంబర్ 27న జన్మించాడు. మాటలు రాని వయసులోనే ఆదిత్య సంకేత భాషలో తల్లిదండ్రుల ద్వారా వివిధ యాక్టివిటీలు నేర్చుకున్నాడు. ఆదిత్యలో అధిక చురుకుతనం గమనించిన స్థానికులు మెచ్చుకుని ఇంకా నేర్పించాలని తల్లిదండ్రలకు సలహాలు ఇచ్చారు. దీంతో ఆదిత్యను పేరెంట్స్ యాక్టిమిటీ లెర్నింగ్ ఆన్‌లైన్ కోర్సుల్లో చేర్పించారు.

◆ మాటల్లో స్పష్టత లేని వయసులోనే ఆదిత్య హనుమాన్ చాలీసా, రాష్ట్రాలు వాటి ముఖ్యనగరాలను నేర్చుకున్నాడు. ప్రస్తుతం ఈ చిన్నారికి నాలుగు సంవత్సరాలు. రాష్ట్ర జాతీయ విషయాలు, సోలార్ సిస్టం, కాంటినెంట్స్ అండ్ ఓషన్స్, కాలభైరవాష్టకం, భగవద్గీత శ్లోకాలు వంటివి నేర్చుకుంటున్నాడు.

◆ **సూపర్ గ్రాస్పింగ్ అవార్డును సొంతం చేసుకున్నాడు..**

మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డువారు నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొన్న ఆదిత్య మంచి ప్రతిభ కనబరిచాడు. ఆదిత్య ప్రతిభను చూసిన మ్యాజిక్ బుక్ వారు ఆదిత్యను సూపర్ గ్రాస్పింగ్ అవార్డుతో సత్కరించారు. అవార్డును తరగతి క్లాస్ టీచర్ శ్రీమతి కె.దివ్యారెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఆదిత్యను టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ టి.కోటిరెడ్డి అభినందించారు.



పల్లకీ సేవలో పాల్గొన్న కౌన్సిలర్ శంకర్ నాయక్

వైభవంగా అక్షత కలశ శోభాయాత్ర

దుండిగల్: అక్షత కలశ శోభాయాత్ర కార్యక్రమంలో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో శోభాయాత్ర నిర్వహించారు. డి.పోచంపల్లి, దుండిగల్, గాగిల్లాపూర్ ప్రాంతాల్లో అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలను పంచి పెట్టారు. డి.పోచంపల్లిలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, సత్యనారాయణ, మధు, వెంకటేశ్ పాల్గొన్నారు. గాగిల్లాపూర్‌లో నిర్వహించిన పల్లకీ సేవలో స్థానికులతో కలిసి కౌన్సిలర్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



డి.పోచంపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

రెచ్చిపోతున్న నిర్మాణ వ్యర్థాల డంపింగ్ మాఫియా!



జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని ఉన్న హెచ్‌ఎంటీ స్థలంలో ఇలా డంపింగ్

రంగారెడ్డినగర్: ప్రభుత్వ ఖాళీస్థలాలు భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్ మాఫియాకు కాసుల కురిపిస్తున్నాయి. ఎక్కడ స్థలం కనిపించినా ట్రాక్టర్లలో డెబ్రిస్‌ను తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. హెచ్‌ఎంటీ, ఐడీపీఎల్ స్థలాలు డ్రెబిస్‌తో నిండిపోతున్నాయి. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్, వెంకట్రామిరెడ్డినగర్‌లకు ఆనుకుని ఉన్న హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశం, రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయం సమీపంలో ఉన్న ఏపీహెచ్‌బీ ఖాళీ ప్రాంతం, గురుమూర్తినగర్‌కు ఆనుకుని ఉన్న ఐడీపీఎల్ ఖాళీ ప్రాంతాల్లో ప్రధానంగా డంపింగ్ కొనసాగుతోంది. జంట సర్కిళ్ల అధికారులు ఈ అక్రమ డంపింగ్‌లపై కొరడా ఝుళిపించి నిర్మాణ వ్యర్థాల డంపింగ్ మాఫియాను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.



ఏపీహెచ్‌బీ కాలనీలోని ఖాళీ ప్రాంతంలో డ్రెబిస్‌ను వేసిన దృశ్యం

ప్రజాపాలన పకడ్బందీ పర్యవేక్షణ

రంగారెడ్డినగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆయా డివిజన్ల పరిధిలోని వార్డు కార్యాలయాలు, కమిటీ హాళ్లల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు అభయ హస్తం దరఖాస్తులను అందజేసేందుకు తరలి వస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు, కార్యక్రమ నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు.

నేటి ప్రజాపాలన స్వీకరణ కేంద్రాలు, దరఖాస్తులు స్వీకరించే బస్తీ, కాలనీలు ఇవే..

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో..

రంగారెడ్డినగర్ డివిజన్..

◆ గాంధీనగర్ కమిటీహాల్‌లో నందానగర్, ఆదర్శనగర్ కమిటీహాల్‌లో ఆదర్శనగర్, రంగారెడ్డినగర్ సెయింట్ ఇషాక్ స్కూల్‌లో పంచశీలకాలనీ.

సుభాష్‌నగర్ డివిజన్..

◆ సుభాష్‌నగర్ వార్డు కార్యాలయంలో నరసింహ బస్తీ, ఎస్‌ఆర్ నాయక్ నగర్ కమిటీహాల్‌లో ఆనంద్‌నగర్, అపురూపా కాలనీ కమిటీహాల్‌లో వెంకటాద్రినగర్, సూరారం లూయిస్ బ్రెయిలీ భవనంలో సాయిబాబానగర్..

కుత్బుల్లాపూర్ డివిజన్..

◆ పద్మనగర్ ఫేజ్–2 కమిటీహాల్‌లో బాల్‌రెడ్డినగర్, మాణిక్యనగర్ కమిటీహాల్‌లో అంబేడ్కర్‌నగర్, వాణినగర్ వినాయక మండపంలో ద్వారకాపూరి కాలనీ,, కల్పన సొసైటీ హాలులో పాపయ్యయాదవ్‌నగర్.

జీడిమెట డివిజన్..

◆ ప్రసూననగర్ కమిటీహాల్‌లో రామరాజు నగర్, దుర్గా ఎస్టేట్స్ కమిటీహాల్‌లో స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, కుత్బుల్లాపూర్ గ్రామం సీనియర్ సిటిజెన్స్ భవనంలో అయోధ్యనగర్, గాయత్రినగర్ వార్డు కార్యాలయంలో గాయత్రినగర్, గోదావరి హోమ్స్.

గాజులరామారం సర్కిల్ పరిధిలో..

గాజులరామారం డివిజన్..

◆ గాజులరామారం వార్డు కార్యాలయంలో బాలయ్యనగర్, ఉషోదయ కాలనీ కమిటీ హాల్‌లో బాలాజీ లేఅవుట్, దేవేందర్‌నగర్ కమిటీహాల్‌లో మిథిలానగర్, సుభాష్‌చంద్ర బోస్ కమిటీహాల్‌లో ఎన్టీఆర్‌నగర్.

జగద్గిరిగుట్ట డివిజన్..

◆ జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయంలో రాజీవ్‌గృహకల్ప, దేవమ్మబస్తీ గణేష్ మండపంలో పాపిరెడ్డినగర్, మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపంలో మైసమ్మనగర్ బ్లాక్–బి, జగద్గిరినగర్ కమిటీహాల్‌లో మగ్దూమ్‌నగర్.

చింతల్ డివిజన్..

◆ చింతల్ వార్డు కార్యాలయంలో భగత్‌సింగ్‌నగర్, ఎస్‌ఎల్‌బీనగర్ కమిటీహాల్‌లో ఎస్‌ఎల్‌బీ నగర్, శ్రీనివాసనగర్ కమిటీహాల్‌లో వల్లభాయ్ పటేల్‌నగర్, చింతల్ కాశీనాథ్ కల్యాణ మండపంలో దుర్గయ్యనగర్.

సూరారం డివిజన్..

◆ నెహ్రూనగర్ వార్డు కార్యాలయంలో హెచ్‌ఏఎల్ కాలనీ, రాజీవ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో రాజీవ్‌గాంధీనగర్, సూరారం అంబేడ్కర్ భవన్‌లో లక్ష్మీనగర్, సంజయ్‌గాంధీనగర్ కమిటీహాల్‌లో న్యూషాపూర్‌నగర్.

సీఎంను కలిసిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నేతలు

కుత్బుల్లాపూర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుని సీఎంను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ బలోపేతం తదితర విషయాలపై చర్చించినట్లు భూపతిరెడ్డి తెలిపారు. ఆయన కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

బాలానగర్: కూలి పనికి వెళ్లిన ఓ గృహిణి విద్యుదాఘాతానికి మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. శాంతయ్య, ఎల్లమ్మ(43)దంపతులు గౌతమ్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బ్రహ్మయ్య అనే వ్యక్తి దగ్గర ఎల్లమ్మ పనికి వెళ్లింది. పనిచేసుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడి పోయింది. వెంటనే ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది. మృతురాలి భర్త శాంతయ్య ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్కీ అభివృద్ధికి కృషి చేస్తాం

రాయదుర్గం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా('ఎస్కీ')లో వేడుకలు నిర్వహించారు. ఎస్కీ అభివృద్ధికి కృషి చేస్తామని, కస్టమర్ సేవలను అందించేలా చూస్తామని ఎస్కీ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎస్ లక్ష్మీకాంత రావు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీలో ఈ ఏడాది టెక్నో హబ్‌ని ప్రారంభిస్తామన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్బిట్రేషన్‌లో సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

స్కిల్ యూనివర్సిటీ యోచనను స్వాగతిస్తున్నాం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనను స్వాగతిస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ విద్యార్థి నేత చనగాని దయాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసినా ఉద్యోగ, ఉపాధి లభించక నిరుద్యోగులుగా మారుతున్నారని తెలిపారు.

తెగిపడిన వైర్లు.. రాకపోకలకు ఇబ్బందులు



మారుతినగర్ రోడ్డుపై రాకపోకలకు ఆటంకంగా మారిన కేబుల్ వైర్లు

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లపై గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్న కేబుల్ వైర్లతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతినగర్ ప్రధాన రోడ్డులో తెగిపడిన కేబుల్ వైర్లు రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి.. గాంధీనగర్ మీదుగా భగత్‌సింగ్‌నగర్, చింతల్‌కు వెళ్లే వాహనదారులు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. గత ఐదారు రోజులుగా రోడ్డుపై పడిన కేబుల్ వైర్లను తొలగించడంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు వెళ్లే క్రమంలో కేబుల్ వైర్లు చక్రాల్లో చిక్కుకుని కింద పడుతున్నారు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు సంబంధిత కేబుల్ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని, రాకపోకలకు ఆటంకంగా మారిన వైర్లను అక్కడ నుంచి తరలించేలా సిబ్బందిని ఆదేశించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసులకు చుక్కలు చూపించిన మందుబాబు



సూరారంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు



ట్రాఫిక్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ

జీడిమెట్ల: మద్యం మత్తులలో ఓ వ్యక్తి జీడిమెట్ల పోలీసులకు చుక్కలు చూపించాడు. డిసెంబర్ 31 ఆదివారం రోజున రాత్రి 10గంటలకు ఓ వ్యక్తి బైక్‌పై వస్తుండగా పోలీసులు ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. సదరు వ్యక్తి మద్యం తాగినట్లు రీడింగ్ వచ్చింది. ఇక సదరు వ్యక్తి తనను ఎలా అపుతారంటూ ఓ గంటపాటు ఏసీపీ, ఎస్సైకి చుక్కలు చూపించాడు. చివరికి నిబంధనల ప్రకారం పోలీసులు చేసే పనిచేశారు.

80మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

సుభాష్‌నగర్: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఆదివారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 80 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని ట్రాఫిక్ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్, సూరారం, బహదురుపల్లి, గండి మైసమ్మ, గాగిల్లాపూర్ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 80 మంది పట్టుబడ్డారని, వారిపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మనువాద మాఫియా రాజకీయాలను ఓడించాలి

లిబర్టీ: మహర్ రెజిమెంట్ వీరుల పోరాట స్ఫూర్తితో మనువాద మాఫియా రాజకీయాలను ఓడించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సమాజానికి పిలుపునిచ్చారు. సోమవారం భీమా కోరేగావ్ మహర్ రెజిమెంట్ శౌర్య దివాస్ 206 విజయోత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన పార్టీ కార్యకర్తలు నిర్వహించిన ప్రదర్శనలో కృష్ణ స్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు, పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు మద్దెల ప్రవీణ్‌కుమార్, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటికాల గణేష్, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బుంగా జయరాజు, నాయకులు సి.హెచ్.కరుణాకర్, ఎస్.రామచందర్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు





సీఎం రేవంత్‌రెడ్డికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, బొంగునూరి కిషోర్‌రెడ్డి

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ నాయకులకు అభినందనలు వెల్లువెత్తాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, బొంగునూరి కిషోర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి బొకేలు అందజేసి సత్కరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు చర్చిల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

– కుత్బుల్లాపూర్



పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సందేశ్ మీడియా కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



మంత్రి శ్రీధర్‌బాబుకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కుత్బుల్లాపూర్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్



కూన శ్రీశైలంగౌడ్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు



చర్చిలో కానుకలు పంపిణీ చేస్తున్న చింతల నాగరాజు



మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతూ..



షాపూర్‌నగర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

నీటి ఎద్దడి తలెత్తకుండా చేస్తాం

- కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి
- డిసెంబర్ 31 వరకు పెరిగిన నీటి కనెక్షన్లు 82,941
- తాగునీటి పైపులైన్ పనుల విస్తరణ వేగవంతం

చింతల్: కుత్బుల్లాపూర్‌లో నీటి ఎద్దడి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్‌లో పాత బస్తీలు, కాలనీలతో పాటు కొత్తగా ఏర్పాటవుతున్న అన్ని కాలనీలలో మురుగు నీటి పైపులైన్లతో పాటు తాగునీటి పైపులైన్‌లను విస్తరించినట్లు పేర్కొన్నారు. ఇంటింటికి తాగునీటి లక్ష్యంతో నూతన కనెక్షన్లను గడువు లోపలే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 2023 డిసెంబర్ 31 వరకు 82941 నీటి కనెక్షన్లు పెరిగాయని అన్నారు. అదేవిధంగా మురుగు నీటి పైపులైన్‌లను ఎప్పటికప్పుడు ఆధునీకరించడంతో పాటు కొత్త లైన్లను విస్తరించినట్లు పేర్కొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పైపులైన్ విస్తరణ ఇలా..

100 ఎంఎం 10.38 కిలోమీటర్లు, 150 ఎంఎం 10.03, 200 ఎంఎం 1.54 కిలో మీటర్లు, 250 ఎంఎం 0.03 కిలో మీటర్లు, 300 ఎంఎం 0.19, 600 ఎంఎం పైపులైన్ 0.01 కిలోమీటర్‌ల మేర విస్తరించగా మొత్తం 2023లో 16.17 కిలో మీటర్ల మేర కుత్బుల్లాపూర్‌లో విస్తరించగా ఓఆర్‌ఆర్ పరిధిలో మరో 70 కిలోమీటర్లు విస్తరించడంతో మొత్తం 86.17 కిలోమీటర్‌ల మేర నూతన తాగునీటి పైపులైన్‌లను వేసినట్‌లైంది.

154.64 కిలోమీటర్ల డ్రైనేజీ పైపులైన్ వేశాం..



ఎం శ్రీధర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌లో మురుగునీటి పారుదల జలమండలికి కేటాయించిన అనంతరం 2022–23 డిసెంబర్ నాఆటికి 154 కిలో మీటర్ల మేర పలు పరిమాణాలలో మురుగు నీటి పైపులైన్‌లను విస్తరించింది. డివిజన్ 12 పరిధిలో 100 ఎంఎం 10.38 కిలోమీటర్లు, 150 ఎంఎం 4.03కిలో మీర్లు, 200 ఎంఎం 7.24 కిలోమీటర్లు, 250 ఎంఎం 15.43 కిలోమీటర్లు, 300 ఎంఎం 31.39 కిలోమీటర్లు, 600 ఎంఎం 0.01 కిలోమీటర్, 16 కిలోమీటర్లు భారీ పైపులైన్‌తో పాటు మరో 70 కిలోమీటర్లు ఓఆర్‌ఆర్ పరిధిలో మురుగు నీటి పైపులైన్‌లను వేయడంతో మొత్తం 154.64 కిలోమీటర్ల మేర 2023 డిసెంబర్ నాటికి విస్తరించినట్లు అయ్యింది. ఇంకా అనేక ప్రాంతాల్లో అక్కడక్కడ తాగునీటి పైపులైన్‌లు, మురుగు నీటి పైపులైన్‌లను విస్తరించడాని ప్రణాళికలు పూర్తయినట్లు జీఎం శ్రీధర్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీపై కసరత్తు

- సర్కారు ఆదేశాలతో ఖాళీలపై సమాచారం కోరిన ఉన్నతాధికారులు
- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో 331 టీచర్, ఆయా పోస్టుల ఖాళీలు
- మూడేళ్లుగా ఎదురుచూస్తున్న వారిలో చిగురించిన ఆశలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీ పోస్టుల భర్తీపై ఆశలు చిగురించాయి. ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడంతో అంగన్‌వాడీల్లో కేంద్రాల్లో టీచర్, హెల్పర్ పోస్టుల కోసం దరఖాస్తు పెట్టుకుని మూడేళ్లుగా ఎదురు చూస్తున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియపై కొత్త ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదలైన వెంటనే గ్రేటర్‌తో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఆయా జిల్లాల్లోని ఖాళీ పోస్టుల సమాచారాన్ని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా గుర్తించిన సంబంధిత అధికారులు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మూడేళ్లుగా ఖాళీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి టీచర్, హెల్పర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయక పోవడం వల్ల ఆశించిన ఫలాలు నెరవేరడం లేదు. పోస్టుల భర్తీపై మండలాలు, ప్రాజెక్టు కమిటీలు భర్తీపై పలు తీర్మానాలు చేసి పంపించినా కాగితాల్లో కదలిక మాత్రం కనిపించడం లేదు. ఉద్యోగ పోస్టులపై కొత్త ప్రభుత్వం నిర్ణయం నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ రానుంది.

విధుల నిర్వహణలోనూ కీలకం

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణ చర్యలతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి విధుల నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కీలక భూమిక పోషిస్తున్నరు. ఒకటి నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్, ఆయాలు(హెల్పర్లు) కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకురావడం, పసిపిల్లలు కావడంతో ఇంటి వద్ద మారం చేస్తే.. వారిని బుజ్జగించడం వంటి విధులు నిర్వహిస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వడం, అవి తిన్న తర్వాత వండిన పౌష్టికాహారం పెట్టడం వంటి విధులు నిర్వర్తిస్తారు. పసి పిల్లలు కావడం వల్ల టాయ్‌లెట్ విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

3,307 కేంద్రాల్లో లబ్ధిదారుల సంఖ్య 3.43 లక్షలు

గ్రేటర్‌తోసహా శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 3,307 ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు సంవత్సరాలలోపు చిన్నారులతో సహా గర్భిణులు, బాలింతలు మొత్తంగా 3,43,694 మంది ఉన్నారు.

◆ గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం పోస్టులు 167 ఖాళీగా ఉండగా, ఇందులో టీచర్ పోస్టులు 42, హెల్పర్లు 125 ఖాళీగా ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 124 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో 21 టీచర్లు, 103 హెల్పర్ పోస్టులు ఉన్నాయి.

జిల్లాలవారీగా అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల సంఖ్య, ఖాళీల వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ సెంటర్లు	లబ్ధిదారుల సంఖ్య	ఖాళీ పోస్టులు
హైదరాబాద్	914	1,19,800	167
మేడ్చల్	793	95,017	124
రంగారెడ్డి	1600	1,28,797	40
మొత్తం	3,307	3,43,694	331